
సాక్షి ఒడిశా

ఆదివారం । 11 । ఆగస్టు । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం శనివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6,50,269లు, బంగారం 63 గ్రాములు, వెండి 25 గ్రాము400 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



గిరిజనుల తిరుగుబాటు

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి సతీష్ చంద్ర దుబేపై గిరిజనులు తిరగబడ్డారు.

- 8లో



శోధనమున పనులు..!

పర్లాకిమిడి పట్టణంలోని సరస్వతి శిశు విద్యా మందిర్‌లో విజ్ఞాన మేళా శనివారం నిర్వహించారు.

- 8లో

న్యూస్‌రీల్

వేధింపులపై కేసు నమోదు

జయపురం: తనను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారని జయపురం సమితి సొరాగుడ గ్రామానికి చెందిన బసంత హరిజన్ తన భర్త, అత్త, ఆడపడుచుపై శుక్రవారం లిఖిత పూర్వక ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మహిళా పోలీసులు కేసు నమోదు చేసినట్లు మహిళా పోలీసుస్టేషన్ అధికారి అనిత కుహూర్ వెల్లడించారు. పోలీసు వివరణ ప్రకారం బసంతను ఆమె అత్తింటి వారు వేధిస్తున్నారు. 2 నెలల కిందట ఆమె ఆడపడుచు వచ్చి బసంతి భర్త పదలామ్ హరిజన్‌ను తనతో తీసుకెళ్లింది. అప్పటి నుంచి భర్త జాడ కనిపించడం లేదు. కొన్ని రోజుల క్రితం భర్త ఏమయ్యాడో తెలుసుకునేందుకు బసంత అత్తవారింటికి వెళ్లి అడుగగా వారు ఆమెను తిట్టి చంపుతామని భయపెట్టారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వల్ప ఉపశమనం

- రూ.100కి 3 కిలోల బంగాళదుంపలు

భువనేశ్వర్: రాష్ట్రంలో కొనసాగుతున్న బంగాళాదుంపల సంక్షోభం నుంచి స్వల్ప ఉపశమనం లభిస్తుంది. నగరంలో వినియోగదారులకు చౌక ధరకు ఆలుగడ్డలు విక్రయిస్తారు. నగరానికి అంచెలంచెలుగా ఆలుగడ్డలు చేరనున్నాయి. ఈ సరుకు చేరడంతో రూ.100లకు 3 కిలోల బంగాళా దుంపలను వినియోగదారులకు అందుబాటులో ఉంచుతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం శనివారం ప్రకటించింది. ఆహార సరఫరా, వినియోగదారుల సంక్షేమ శాఖ భువనేశ్వర్ మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) పరిధిలోని ప్రభుత్వ చౌక ధరల దుకాణాలలో బంగాళాదుంపలను అందుబాటులో ఉంచాతారు. రేషన్ కార్డుదారులు, ఇతర వ్యక్తులందరికీ రూ.100 చొప్పున ప్రతీ కుటుంబానికి 3 కిలోల బంగాళ దుంపలు అందించాలని డీలర్లను ఆదేశించారు. మార్కెట్ రేట్లు స్థిరపడే వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ప్రభుత్వం తగినంత స్టాక్‌ను కొనుగోలు చేసిందని, వినియోగదారులు ఇప్పుడు ఆలుడ్డలు సరసమైన ధరకు పొందగలుగుతారని అన్నారు.

యువకుడి మృతదేహం లభ్యం



పొదల్లో లభ్యమైన రాహుల్ మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని కోరుకొండ సమితి పోట్రాల్ గ్రామ శివారులో ఒక యువకుడి మృతదేహం లభ్యమైంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన రాహుల్ పంగి (25) అనే యువకుడు శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి బైక్‌పై బయటకు వెళ్లాడు. అయితే అతను తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఫ్రెండ్స్ వద్ద ఉంటాడని కుటుంబ సభ్యులు భావించారు. కానీ ఏమైందో ఏమోగానీ శనివారం ఉదయం గ్రామ శివారులోని పొదల్లో శవమై కనిపించాడు. మృతదేహం చూసిన స్థానికులు కోరుకొండ పోలీసులకు సమాచారం ఇవ్వడం జరిగింది. దీంతో ఐఐసీ హిమాన్స్ బారిక్ తన పోలీసులతో సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహం రాహుల్‌దిగా గుర్తించి, కుటుంబ సభ్యులకు తెలియజేశారు. ముఖంపై తీవ్ర గాయాలు ఉండడంతో బైక్ అదుపుతప్పి పడిపోయాడా లేక ఎవరైనా హత్యచేసి పడేశారా అనే కోణంలో దర్యాప్తు చేశారు. మృతదేహన్ని పోస్టు మార్టం నిమిత్తం మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

విరిగిపడిన కొండ చరియలు



రోడ్డుపై విరిగిపడిన కొండ చరియలు

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి జాంత్రీ పంచాయతీకి వెళ్లే ఘాటీలో శుక్రవారం కొండ చరియలు విరిగిపడి రహదారి బంద్ అయ్యింది. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. అధికారులు వెంటనే స్పందించి రహదారిని క్లియర్ చేశారు. ఈ ఘాటీపై 13 గ్రామాలు ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలతో ఇటువంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి.

ఉత్కళ తీరం వివిధ రుచులకు సమాహారం. శ్రీజగన్నాథుడి నైవేద్యం మొదలుకొని పెళ్లిళ్లలో సారె వరకు నోరూరించే వంటకాలకు నిలయం మన రాష్ట్రం. ఎన్ని కొత్త రకాల రుచులు వచ్చినా, దశాబ్ధాలు గడిచినా వాటి రుచికి లేదు ఏదీ సాటి. నోట్లో వేయగానే కరిగిపోయే ఛెన్నా పొడా నుంచి కరకరలాడే రుచులెన్నో మనసును దోచుకుంటాయి. రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేకమైన వంటకాలే కాకుండా స్పెషల్ డిషెస్ జిహ్వాతో తాకితే వహ్ వా అనడం గ్యారెంటీ. అలాంటి వంటకాల్లో కొన్నింటిని ఒక్కసారి పరిశీలిస్తే...

– భువనేశ్వర్/రాయగడ/ మల్కన్‌గిరి



సండే స్పెషల్

ఒడిష్‌శా తీరం రుచుల సమాహారం..!

సాటిలేని మిఠాయి.. ఛెన్నా పొడా



రాష్ట్రంలో ఎన్ని రుచులు ఉన్నా.. మిఠాయి సామ్రాజ్యంలో సాటి లేనిది ఛెన్నాపొడా. సంప్రదాయ రీతిలో కాల్చే పొడొ పిఠా రుచికి నోరూరని వారు ఉండరన్నది అతిశయోక్తి కాదు. సర్వ జనుల నోరూరించే ఈ ఛెన్నా పొడొ స్వాతంత్ర్యం సాధించిన సంవత్సరం 1947లో ఆవిర్భవించడం విశేషం. ఏటా ఏప్రిల్ 11వ తేదీన దినోత్సవంగా జరుపుకుంటారు. కోస్తా ఒడిశా ప్రాంతంలో దీని రుచి ఎరుగని వారు ఉండరు. ఈ ప్రాంతీయులు నలుమూలల విస్తరించిన ఆత్మీయులు, బంధువులకు ఎంతో ఆప్యాయంగా దీనిని పంపిస్తారు. రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ ఒడిశా మిల్క్ ఫెడరేషన్ ఓంఫెడ్ ఛెన్నా పొడొ విక్రయానికి శ్రీకారం చుట్టింది.

దసపల్లాలో ఆవిర్భావం

ఛెన్నా పొడా కోస్తా ప్రాంతం నయాగడ్ జిల్లా దసపల్లా ప్రాంతంలో ఆవిర్భవించింది. వ్యర్థం నుంచి పరమ రుచికరమైన మిఠాయిగా రూపుదిద్దుకుంది. కాసింత మెలకువతో ఎంతో సులువుగా మరెంతో చౌకగా ఛెన్నా పొడొ తయారు చేసుకోవచ్చు. 16 ఏళ్ల ప్రాయంలో సుదర్శన్ సాహు అనే మిఠాయి వంట పుట్టి ఛెన్నా పొడొ ఆవిష్కరించాడు. 1947లో నయాగడ్ కచేరి బజారులో దసపల్లా హోటల్ ఏర్పాటు చేసిన తొలి రోజుల్లో ప్రయోగాత్మకంగా ఈ మిఠాయిని తయారు చేశాడు. మిగిలిన ఛెన్నా వృథా చేయకుండా బెల్లం జోడించి కాల్చి రొట్టెలా చేస్తే ఎలా ఉంటుందనే సృజనాత్మక ఆలోచనతో రాత్రికి రాత్రి తయారు చేయడం విశేషం. అదే నేడు అత్యంత ప్రాచుర్యం సంతరించుకుంటున్న మిఠాయిగా వెలుగొందుతోంది. ఆవిష్కర్త సుదర్శన్ సాహు 1931 సంవత్సరం ఏప్రిల్ 11వ తేదీన నయాగడ్ జిల్లా దసపల్లా సాతొపట్నా గ్రామంలో జన్మించారు. ఆయన జన్మదినం పురస్కరించుకుని రాష్ట్రంలో ఏటా ఏప్రిల్ 11న ఛెన్నా పొడొ దినోత్సవంగా వేడుకగా జరుపుకుంటున్నారు. గత 2 ఏళ్లుగా ఈ వేడుకని జరుపుకుంటున్నారు.

ఇంట్లో తయారీ ఇలా...

ఛెన్నా పొడొ రుచించేందుకు హోటళ్లు, రెస్టారెంట్లకు వెళ్లాల్సిన అవసరమేమీ లేదు. సునాయాసంగా ఇంట్లోనే అత్యంత స్వల్ప ఖర్చుతో తయారు చేసుకోవచ్చు. ఛెన్నాలో పంచదార, బొంబాయి రవ్వ కలిపి ముద్దగా కలుపుకుని ఒక పాత్రలో మినప రొట్టె తరహాలో అమర్చుకోవాలి. దీనిపై ఘుమఘుమల కోసం అవసరమైన ద్రవ్యాలను హత్తుకుని పొయ్యి మీద పెట్టి కాల్చుకుంటే ఊరించే ఛెన్నా పొడొ తయారైపోతుంది. అయితే అవసరమైన పదార్థాలను మిశ్రమంగా కలిపి పాత్రలో సిద్ధం చేసుకున్నంత వరకు సులువే. ఈ మిశ్రమం అమర్చిన పాత్రకు దిగువ, పైన సమాన సెగ కోసం నిప్పులను సరి చేసుకోవడం ముఖ్యం. మంటపై కాకుండా నిప్పులపై కాల్చితే ఛెన్నా పొడొ పుట్టినింటి రుచులతో మీ నోటికి అందుతుంది. కింద, పైన నిప్పుల సెగతో కాలే సమయంలో మాడి మసిబారిపోకుండా పాత్రలో ముందుగా అడుగున నెయ్యి వంటి తైలం పూసి, ఆపై తైలం పూసిన విస్తరాకు లేదా అరటి ఆకుని పరిచి దానిపై మిశ్రమాన్ని సర్దాలి. అలాగే మిశ్రమం పైభాగంలో కూడ తైలపు పూత ఆకుని చేర్చి మూతబెట్టుకుని పొయ్యిపై పెట్టాలి. తగిన పదునులో కాలిన ఛెన్నా పొడొ ఇట్టే తనకు కప్పి ఉంచిన ఆకులను తొలగించేస్తుంది. నిప్పుల సెగ బెడద లేకుండా నేటి తరంలో ఒవెన్ వినియోగం మరింత సులభం. ఒవెన్‌లో కేకు తయారు చేసే రీతిలో ఛెన్నా పొడొ కూడ చేసుకునేందుకు వీలవుతుంది. జన్మదినం వంటి ఆనంద ఘడియల్లో పాశ్చాత్య కేకు బదులుగా ఛెన్నా పొడొ చేర్చుకుంటే శాకాహార, మాంసాహార తేడా లేకుండా ఆబాల గోపాలం రుచికరమైన వంటకం రుచి చూస్తారు. ఛెన్నా అంటే జున్ను. పొడొ అంటే కాల్చడం. అందుకే ఛెన్నా పొడొగా ప్రతీతి. మనకు పరిచితమైన జున్ను అనుకుంటే పొరబడినట్లే. విరిగిన పాలులో నీరు లేకుండా గట్టిగా పిండి వడగడితే తేలిన ఓ విభిన్నమైన పాల ఉత్పాదనగా గుర్తుంచుకోవాలి.

నోరూరించే కై చట్నీ (ఎర్ర చీమల చట్నీ)



మల్కన్‌గిరి జిల్లాలో ఆదివాసీల సాంప్రదాయ ఆహారం కై చట్నీ. దీనిని అడవిలో తిరిగే ఎర్ర చీమలతో తయారు చేస్తారు. ఈ చీమల్లో ఔషధ గుణాలు ఉంటాయని కోయ తెగ గిరిజనుల నమ్మకం. దీనికి భౌగోళిక (జీఐ)ట్యాగ్ లభించింది.

తయారు చేసే విధానం

మల్కన్‌గిరి జిల్లాలోని ఆదివాసీలు ముందుగా అడవిలో తిరిగే ఎర్రటి చీమలను సేకరిస్తారు. వీటిని బాగా ఎండబెట్టుకుంటారు. అనంతరం వాటిని శుభ్రం చేసి ఉప్పు, నిమ్మరసం, తెల్లుల్లి, అల్లం, జీలకర్ర వేసి సన్నిమీద నూరుతారు. అనంతరం దానిలో కొత్తిమీర వేసుకొని తింటే చాలా అత్యంత రుచికరంగా ఉంటుంది. దీనిని తినడం వలన ఎటువంటి గ్యాస్‌కు సంబంధించిన జబ్బులు రావని వీరు చెబుతారు.



కమ్మని కక్కరాలు



కరకర రుచులే కాదు.. కమ్మని కక్కరాలంటే ఇష్టపడనివారు ఉండరు. రాయగడ అనేసరికి అందరికీ గుర్తుకు వచ్చేది తేనెలూరే తియ్యని సాంప్రదాయ వంటకం కక్కరాలు. పండగ వచ్చినా, ఇంటికి అతిథి వచ్చినా విందు భోజనంలో కక్కరాలు ఉండాల్సిందే. సాంప్రదాయ వంటల పోటీల్లో వీటికి ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. ఆరోగ్యానికి హాని చేయని వరిపిండి, కొబ్బరి కోరుతో చేసే కక్కరాలు స్వయం ఉపాధి మహిళలకు కాసులు కురిపిస్తాయి. జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి మేళాల్లో వీటికి ప్రత్యేక స్థానం ఉంటుంది.

తేనెలొలికించే ఖీరీ

పాయసం కమ్మదనం తెలియని వారు ఉండరు. ఈ కోవకు చెందినదే రాష్ట్రంలో పేరొందిన ఖీరీ. ఖీరీతో ఏ పాయసం సాటి రాదు. తయారీ సులభమే. ఆరగించడం అంతకంటే తేలిక. నాణ్యమైన ఖీరీ అత్యంత రుచికరమే కాదు, హుందాతనానికి ప్రతీకగా రాజ్యమేలుతోంది. పెండ్లి వంటి ప్రధాన విందుల్లో ఖీరీ లేకుంటే వెలితి కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది.

తయారీ విధానం



ఒక పాత్రలో నెయ్యి పోసి వేడెక్కిన తర్వాత జీడి పలుకులు, కిస్‌మిస్ వేయించి కాసేపటి తర్వాత బియ్యం పోసి కలగలుపుతూ వేపాలి. బ్రౌను రంగు వస్తున్న తరుణంలో పంచదార కూడా కలగలిపి కాసేపు నేతిలో వేయించాలి. దీనిలో కావాల్సినన్ని పాలు పోసి ఉడికించుకుంటూ కోవా కలుపుకోవాలి. స్థానికంగా ఖీరీ బియ్యం కొనుగోలు చేసేందుకు లభ్యమవుతాయి. ఖీరీ కోసం చేర్చిన బియ్యం పూర్తిగా పాలలోనే ఉడికించాలి. బియ్యం ఉడుకుతుండగా పాలు పొంగిపోకుండా మెలకువగా ఉండాల్సిందే. ఉడికే సమయంలో ఖీరీ పదార్థాలు పాత్రకు అడుగంటిపోకుండా కలగలపడంపై జాగ్రత్త అవసరం. పాలు పొంగినా, పాత్రకు అడుగంటినా ఖీరీ రుచులకు దూరం అవుతుంది. శ్రీజగన్నాథ దేవస్థానం ఆలయం వంటి ప్రముఖ దేవస్థానాలతో సాధారణ వైష్ణవ సంప్రదాయ ఆలయాల్లో ఆరాధ్య దైవానికి ఖీరీ నైవేద్యంగా సమర్పించడం కొనసాగుతోంది. పూరీ నుంచి చేరువలో ఉండే బ్రహ్మగిరి అలార్‌నాథ స్వామి దేవస్థానంలో ఖీరీ ప్రసాదం ప్రత్యేకం.

భలే రుచి .. కోరిడి(వెదురు కర్రలు) కూర



మల్కన్‌గిరి జిల్లాలో గిరిజనులు ఎంతో ఇష్టంగా తినే వంటకం ఇది. ఈ కూర కోసం లేత వెదురును అడవి నుంచి తీసుకొచ్చి చిన్నచిన్నగా కోసుకుంటారు. వీటిని కట్టలుగా కట్టి మార్కెట్‌లో అమ్మడం గమనించవచ్చు. ఇళ్లల్లో వంట చేసే వారు ముందురోజు రాత్రి నీటిలో నానబెట్టుకుంటారు. మర్నాడు ఉదయం తీసి చిన్నగా కోసం శనగ పప్పును వేసి వంట చేస్తారు. అలాగే వీటిని పొడవుగా కోసుకొని ఎండబెట్టుకొని నిల్వ ఉంచుకుంటారు. నిల్వ ఉంచుకున్నవాటిని కావాల్సిన సమయంలో వాడుకోవచ్చు. దీనివలన ఆరోగ్యంగా ఉంటామని గిరిజనులు చెబుతారు.

కరుడుగట్టిన నిందితుడు అరెస్టు

జయపురం: సదర్ పోలీసుస్టేషన్ పరిధి ఉమ్మిరి గ్రామానికి చెందిన కార్తీక బాగ్‌ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నంలో గురువారం రాత్రి అరెస్టు చేసినట్లు సదర్ పోలీసుస్టేషన్ అధికారి ఈశ్వర చంద్రతండి శనివారం వెల్లడించారు. అతడి నుంచి ఒక కారు, 5 తుపాకీ గుండ్లు, ఒక ఖాళీ మేగ్‌జెన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కార్తీక్ బాగ్‌పై కొరాపుట్, నవరంగపూర్ జిల్లాల్లో పలు డెకాయిట్, గంజాయి రవాణ, తుపాకీ కాల్పులు, గొడవలు, హత్యలు, బెదిరింపులు తదితర 18 కేసులు ఉన్నట్లు తెలిపారు. 2017లో ఒక కేసులో పరారయ్యాడని, అతడిపై నాన్ బెయిల్ వారెంట్ ఉందని వెల్లడించారు. అలాగే 2023 దసరా రోజు ఉమ్మిరి గ్రామంలో జరిగిన కాల్పుల్లో కేసు ఉందన్నారు. నిందితుడు గతంలో బెయిల్‌పై వచ్చి విశాఖపట్నంలో గత రెండేళ్ల నుంచి ఉంటూ కొరాపుట్ జిల్లా నుంచి గంజాయి రవాణాతో పాటు పలు నేరాలు చేస్తున్నట్లు వెల్లడించారు. అతడిని పట్టుకునేందుకు కొరాపుట్ ఎంపీ అభినవ సోన్‌కార్ జయపురంలో ఒక ప్రత్యేక పోలీసు టీమ్ ఏర్పాటు చేశారని వెల్లడించారు. జయపురం ఎస్‌డీపీవో అంకిత కుమార్ వర్మ, సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండిల సూచనల మేరకు సదర్ పోలీసుస్టేషన్ ఎస్ఐ శిరీష్ కుమార్ మహాపాత్రో నేతృత్వంలో ఒక టీమ్ విశాఖపట్నం వెళ్లి కార్తీక బాగ్ ఆచూకీ తెలుసుకొని అతడి కదలికలపై నిఘా పెట్టారు. అతడు రోడ్డుపై వెళ్తున్న సమయంలో పోలీసులు దాడి జరిపి అరెస్టు చేశారు. అతడిని గురువారం రాత్రి జయపురం సదర్ పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చారు. అనంతరం తమదైన రీతిలో విచారించి కోర్టులో హాజరుపరిచారు.



సీజ్ చేసిన తూటాలు

నిందితుడు కార్తీక్ బాగ్




పట్టుబడిన కారు

రాష్ట్రానికి 6 కొత్త రైల్వే ప్రాజెక్టులు

భువనేశ్వర్: ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీసీఈఏ) 8 కొత్త రైల్వేలైన్ ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. వీటిలో ఒడిశాకు 6 సహా సమగ్ర అంచనా వ్యయం రూ.24,657 కోట్లు కాగా, ఒడిశా ప్రాజెక్టుల అంచనా వ్యయం రూ.15,004 కోట్లు. ఈ రైల్వే ప్రాజెక్టులు ఆకాంక్షాత్మక జిల్లాలు మరియు గిరిజన ఆధిపత్య ప్రాంతాల అభివృద్ధికి గణనీయంగా దోహదపడతాయి. వీటిలో మూడు ప్రాజెక్టులు ఒడిశాలోని దక్షిణ మరియు పశ్చిమ భాగాల్లో ఉన్నాయి. ఏడు రాష్ట్రాల్లోని 14 జిల్లాలు లబ్ధి పొందుతాయి. ఒడిశా, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, జార్ఖండ్, బీహార్, తెలంగాణ మరియు పశ్చిమ బెంగాల్‌లను కవర్ చేసే ఎనిమిది ప్రాజెక్టులు భారతీయ రైల్వేల ప్రస్తుత నెట్‌వర్క్‌ను 900 కిలోమీటర్ల మేర పెంచుతాయి. ఈ ప్రాజెక్టులతో 64 కొత్త స్టేషన్లు నిర్మించబడతాయి. 510 గ్రామాలు మరియు సుమారు 40 లక్షల జనాభాతో ఆరు ఆకాంక్షాత్మక జిల్లాలు తూర్పు సింగ్‌బం, భద్రాద్రి కొత్తగూడెం, మల్కన్‌గిరి, కలహండి, నబరంగ్‌పూర్, రాయగడ ప్రాంతాలను అనుసంధానపరుస్తాయి.

ప్రాజెక్టుల వివరాలు

- గుణుపురం – తేరుబలి (కొత్త లైన్) – రూ.1,326 కోట్లు
- జునాగఢ్ – నవరంగపూర్ (కొత్త లైన్) – రూ.3,274 కోట్లు
- మల్కన్‌గిరి – భద్రాచలం –పాండురంగపురం (కొత్త లైన్) – రూ.4,109 కోట్లు
- బాదంపహాడ్ – కెందుఝర్‌గడ్ (కొత్త లైన్) – రూ.2,107 కోట్లు
- బంగ్రిపోషి – గోరుమహిసాని (కొత్త లైన్) – రూ.2,549 కోట్లు
- బురామర – చకులియా (కొత్త లైన్) – రూ.1,639 కోట్లు



క్లుప్తంగా

ఎట్టకేలకు విద్యుత్ పునరుద్ధరణ పనులు



విద్యుత్ పునరుద్ధరణ పనులు చేస్తున్న సిబ్బంది

జయపురం: సబ్ డివిజన్ పరిధి బొయిపరిగుడ సమితి పెందపాడ గ్రామ పంచాయతీ మఝిగుడ గ్రామంలో ఇటీవల కురిసిన కుండపోత వర్షాలకు ఒక చెట్టు కూలి విద్యుత్ స్తంభంపై పడిపోయింది. దీంతో గ్రామానికి అప్పటి నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ విషయాన్ని గ్రామస్తులు విద్యుత్ అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదు. దీంతో ఆ గ్రామస్తులు 8 రోజులుగా అంధకారంలోనే ఉన్నారు. కాగా ఈ విషయంపై అధికారులుగా విజ్ఞప్తులు చేస్తూనే ఉండడంతో ఎట్టకేలకు విద్యుత్ సరఫరాకు అవసరమైన పనులు శనివారం చేపట్టారు. గత 8 రోజులుగా తాము అనేక ఇబ్బందులు పడ్డామని, అటవీ ప్రాంతంలో ఉండడం వలన వన్య జంతువులు, మృగాల భయంతో బిక్కుబిక్కుమంటూ ఉన్నామని వాపోయారు. ఇప్పటికైనా మరమ్మతులు చేపట్టడంపై హర్షం వ్యక్తం చేశారు.

ఉన్నత చదువుకు సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఆదేశాల మేరకు పర్లాకిమిడి జంగం వీధికి చెందిన మృతుడు జి.షణ్ముఖరావు కుటుంబానికి జిల్లా కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ శనివారం రూ.15 వేల చెక్కు అందజేశారు. మృతుడు జి.షణ్ముఖరావు కుమారుడు స్థానిక శ్రీకృష్ణచంద్ర గజపతి కళాశాలలో ప్లస్ టూ చదువుతున్నాడు. దీంతో కుమారుడి ఉన్నత చదువులకు సాయంగా అందించారు. కార్యక్రమంలో ఏడీఎం రాజేంద్రమింజ్, రవీంద్ర కుహోరో, డిప్యూటీ కలెక్టర్ కమలకాంత పండా తదితరులు పాల్గొన్నారు.

'13 నుంచి ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం'



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 13వ తేదీ నుంచి 15 వరకు ప్రతి ఇంటిపైన త్రివర్ణ పతాకాలు ఎగురవేసే కార్యక్రమం చేపట్టాలని కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ అధికారులకు శనివారం ఆదేశించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో పంచాయతీ, సమితి, ఎన్ఏసీ, మున్సిపల్ అధికారులు, స్వయం మహిళా సహాయక సంఘాలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యనిర్వహణ అధికారి డా.గుణనిధి నాయక్, ఏడీఎం రాజేంద్ర మింజ్, జిల్లా ముఖ్య శిక్షాధికారి డా.మాయాధర్ సాహు, డీఐపీఆర్వో ప్రదిప్త గురుమయి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి మమతా పాఢి, జిల్లా సాంస్కృతిక అధికారి అర్చనా మంగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా మొక్కల పంపిణీ



మొక్కలు పంచుతున్న రోటరీ క్లబ్ సభ్యులు

జయపురం: వన మహోత్సవాల్లో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలనే ఉద్దేశంతో జయపురం రోటరీ క్లబ్ సభ్యులు ఉచితంగా మొక్కలు పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఎస్.ఆనందరావు పర్యవేక్షణలో స్థానిక గుప్తేశ్వర కాంప్లెక్స్‌లో మొక్కలు పంచే కార్యక్రమం శనివారం నిర్వహించారు. మామిడి, పనస, ఉసిరి, జామి, వేప మొదలగు వివిధ రకాలకు చెందిన 500 మొక్కలను ప్రజలకు అందజేశారు. వృక్ష సంపదే జీవరాశుల మనుగడకు ఆధారమని, అందువలన ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచి వృక్షాలుగా మార్చాలని రోటరీ అధ్యక్షుడు ఆనందరావు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి రాజేంద్ర జైన్, వర్కింగ్ సెక్రటరీ మహేష్ డొలకియ, సభ్యులు పూర్ణచంద్ర పట్నాయిక్, సందీప్ చాంద్, రాజీవ సిన్హా, రామావతార గుప్త, ఎ.రామకృష్ణ, శ్యామ యమునీ, భరత్ కురాన్, పి.భాస్కర పాత్రో పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 50 మేకపిల్లలు మృతి

నందిగాం: సంతబొమ్మాళి మండలం అల్లాడ గ్రామం సమీపంలో కుక్కల దాడిలో సుమారు 50 మేక పిల్లలు మృతి చెందాయి. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. నందిగాం మండలం శివరాంపురం గ్రామానికి చెందిన దుబ్బ రంగారావు అనే పాడి రైతు తన గొర్రె పిల్లలను మేత కోసం అల్లాడ జంక్షన్ వద్ద మంద వేశారు. అయితే ఆ మందపై కుక్కలు దాడి చేసి 50 మేక పిల్లలను చంపేసినట్లు తెలిపారు.

గిరిజనుల తిరుగుబాటు

- సేరుబందు గనుల తవ్వకాలపై నిరసన
- కేంద్రమంత్రి సతీష్ చంద్ర దుబెపై ఆగ్రహం
- సాంప్రదాయ ఆయుధాలతో ముట్టడి

కొరాపుట్:

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి సతీష్ చంద్ర దుబేపై గిరిజనులు తిరగబడ్డారు. శనివారం కొరాపుట్ జిల్లా పొట్టంగి సమితి తురియా వద్ద సేరుబందులో బాక్సైట్ తవ్వకాల కోసం మంత్రి శిలాఫలకం ఆవిష్కరించాల్సి ఉంది. దీంతో ఆ ప్రాంత గిరిజనులకు ముందస్తు సమాచారం లేకుండా మంత్రి రహస్య పర్యటనకి అధికారులు అన్ని విధాల ఏర్పాట్లు చేశారు. కాగా ఇక్కడ తమ ప్రాంతంలో గనుల తవ్వకాలు చేయకుండా గిరిజనులు చాలా సంవత్సరాలుగా పోరాటాలు చేస్తున్నారు. గతంలో కూడా గ్రామ సభలు, ప్రజాభిప్రాయ సేకరణ వంటి ప్రయత్నాలు ప్రభుత్వాలు చేసినప్పటికీ గిరిజనుల తీవ్ర వ్యతిరేకత వలన నిలిచిపోయాయి. ప్రస్తుతం రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మరలా ఈ ప్రయత్నాలు ప్రారంభించింది. మంత్రి పర్యటన గురించి తెలుసుకున్న గిరిజనులు వ్యూహాత్మకంగా వ్యవహరించారు. వేర్వేరు బృందాలుగా వీడిపోయి ముందస్తుగా అనుకున్న ప్రాంతాలకు వెళ్లిపోయారు. మంత్రి వెళ్లే మార్గాలను అంచనా వేసుకొని ఒక్కసారిగా ఆయా ప్రాంతాలను దిగ్బంధించారు. తురియా వద్ద భారీ వాహన కాన్వాయ్‌ని నిలువరించారు. దీంతో భద్రతా బలగాలు ఆ ప్రాంతానికి చేరుకునేసరికి గిరిజనులు శంకుస్థాపన ప్రాంతాన్ని ఆక్రమించారు. అక్కడ సిద్ధంగా ఉన్నటువంటి టెంట్లు పీకేసి భారత అల్యూమినియం కేంద్రం (నాల్కొ) బ్యానర్లను చించేశారు.



నిలిచిన ఎమ్మెల్యేలు



సాంప్రదాయ ఆయుధాలతో గిరిజనులు



ఆందోళనకారులు పీకేసిన టెంట్లు

శిలా ఫలకం ధ్వంసం

అంతేకాకుండా గిరిజనులంతా కలిసి శిలా ఫలకం ధ్వంసం చేశారు. కొన్ని ప్రాంతాల్లో తమ సాంప్రదాయ ఆయుధాలతో ప్రదర్శన చేశారు. పరిస్థితి చేయి దాటిపోవడంతో మంత్రికి అధికారులు పరిస్థితిని వివరించారు. దీంతో మంత్రి సతీష్ చంద్ర దుబే తన పర్యటన రద్దు చేసుకొని దమంజోడిలోని నాల్కో సముదాయానికి వెళ్లిపోయారు. గిరిజనులను నచ్చజెప్పడానికి ప్రయత్నించిన బీజేపీకి చెందిన కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం మచ్చో, బీజేపీ నాయకులపై తీవ్ర నిరసన వ్యక్తమయ్యింది. ఇదే కార్యక్రమానికి హాజరైన కాంగ్రెస్‌కి చెందిన పొట్టంగి ఎమ్మెల్యే, సీఎల్పీ నాయకుడు రాం చంద్ర ఖడం మౌనం వహించారు. ఆందోళనలో 6 గ్రామ పంచాయతీలకు చిందిన వందలాది మంది గిరిజనులు పాల్గొన్నారు. సంఘటన స్థలంలో ఉన్న కొరాపుట్ కలెక్టర్ వి.కీర్తి వాసన్, ఎస్పీ అభినవ శంకర్‌లు గిరిజనులతో పలు దపాలుగా చర్చించినప్పటికీ ఫలితం లేకపోయింది.



శిథిలమైన శిలా ఫలకం



చిరిగిన నాల్కో బ్యానర్



ఆందోళనకారులతో అధికారుల చర్చలు



మోహరించిన సాయుధ బలగాలు



నిరసనల చేపడుతున్న గిరిజనులు



అధికారుల సమాలోచనలు

శోధనమున పనులు..!

- సరస్వతీ శిశు విద్యా మందిర్‌లో విజ్ఞాన మేళా

పట్టణంలోని సరస్వతీ శిశు విద్యా మందిర్‌లో విజ్ఞాన మేళా శనివారం నిర్వహించారు. మేళాను డీఈవో డా.మాయాధర్ సాహు ప్రారంభించారు. విద్యార్థులు తమ ఆలోచనలతో అద్భుతాలు సృష్టించవచ్చని పేర్కొన్నారు. ప్రాజెక్టులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో విజయం సాధించాలని ఆకాంక్షించారు. మేళాలో 210 సైన్సుకు సంబంధించిన ప్రాజెక్టులు ప్రదర్శనలో ఉంచారు. మేళాకు పాఠశాల పర్యవేక్షణ కమిటీ అధ్యక్షుడు సుభాష్ చంద్ర జమాదార్ అధ్యక్షత వహించగా, గౌరవ అతిథులుగా జిల్లా సైన్సు కో-ఆర్డినేటర్ ఎ.రవికుమార్, విద్యాలయ పర్యవేక్షణ కమిటీ కార్యదర్శి చంద్రశేఖర్ పట్నాయిక్, మహంత రామానంద దాస్, ప్రధాన ఆచార్యులు సరోజ్ కుమార్ పండా హాజరయ్యారు. న్యాయ నిర్ణేతలుగా సాత్మిక్ పట్నాయిక్, గుసాని బీఈవో బాలకృష్ణ మఝి, సులతా శుభదర్శినీ తదితరులు వ్యవహరించారు. – పర్లాకిమిడి



ఉపరితల రవాణాపై విద్యార్థిని సమీక్ష నాయక్ ప్రదర్శన



జల సంరక్షణపై ఒక విద్యార్థి సమర్పించిన ప్రాజెక్టు



నీటి సంరక్షణపై ప్రాజెక్టు



భవిష్యత్తులో రవాణా వ్యవస్థపై ప్రాజెక్టు



సైన్స్ మేళ ప్రారంభిస్తున్న దృశ్యం



విజ్ఞాన ప్రదర్శన తిలకిస్తున్న డీఈవో మాయధర్ సాహు



ఆరో తరగతి విద్యార్థులు నీటి సంరక్షణపై ప్రాజెక్టు



స్మార్ట్‌సిటీలో ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థపై వివరిస్తున్న విద్యార్థి

విజయోత్సాహం



పారిస్ ఒలింపిక్స్‌లో భారత పురుషుల జట్టు కాంస్య పతకాన్ని గెలుచుకుంది. ఈ సందర్భంగా స్థానిక కళింగ స్టేడియంలో ప్రత్యేక విజయోత్సాహ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి హాజరై, కేక్‌కట్ చేసి ఆనందం పంచుకున్నారు. కార్యక్రమంలో క్రీడాశాఖ మంత్రి సూర్య వంశీ సూరజ్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. – భువనేశ్వర్

'తల్లిదండ్రులు సమయం కేటాయించాలి'



మాట్లాడుతున్న హెచ్‌ఎం ప్రకాశ్ చంద్ర పట్నాయిక్

జయపురం: తమ పిల్లల చదువు, క్రమశిక్షణపై తల్లిదండ్రులు సమయం కేటాయించాలని ఉపాధ్యాయులు సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం శనివారం నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం ప్రకాశ్ చంద్ర పట్నాయిక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు ఉపాధ్యాయులు మాట్లాడారు. పిల్లలకు ఇంటి పనులపై సైతం అవగాహన కల్పించాలన్నారు. స్మార్ట్ క్లాస్ రూం, స్మార్ట్ బోర్డు తదితర విషయాలపై వివరించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులు తమ అభిప్రాయాలు వెల్లడించారు. సమావేశంలో ఉపాధ్యాయులు విశ్వరంజన్ గౌఢ, ప్రభాతీ పాణిగ్రహి, కల్యాణీనాయిక్, దుర్గాప్రసాద్ పాత్రో, అరుంధతి త్రిపాఠీ, శుభశ్మిత సాహు, కె.ప్రమీళ, సస్మిత జెన, సోమనాథ్ సాకియ, దేవేంద్ర కుమార్ పాఢీ, సంతోషిణీ పండ, సాగరిక పాత్రో తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న తల్లిదండ్రులు

విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు



రాయగడ: విద్యార్థులకు నులి పురుగుల మాత్రలు వేస్తున్న డాక్టర్ లాల్ మోహన్

పర్లాకిమిడి: గుసాని సమితి కెరండి పంచాయతీలోని పాఠశాలలో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేశారు. చిన్నారుల్లో నులి పురుగు పెరగడం వలన రక్త హీనత, బలహీనంగా ఉండడం వంటివి జరుగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఆరోగ్యాధికారి డాక్టర్ మహేంద్ర కుమార్ భుయ్యాన్, జాతీయ గ్రామీణ హెల్త్ మిషన్ మేనేజర్ సౌమ్యరాణి గాడో, గుసాని సమితి హెల్త్ విస్తరాణాధికారి మమతా పాఢి, గుసాని సమితి విద్యాధికారి టి.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రాయగడ: జిల్లాలో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులి పురుగుల మాత్రలు వేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ లాల్ మోహన్ రౌత్ రాయ్, జిల్లా అదనపు వైద్యాధికారి మామత సాహు, జిల్లా విద్యాశాఖ అధికారి బసంత్ కుమార్ నాయిక్ పాల్గొన్నారు.



పర్లాకిమిడి: విద్యార్థులకు నులి పురుగుల మాత్రలు వేస్తున్న దృశ్యం



పర్లాకిమిడి: పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

వృద్ధుడు ఆత్మహత్య

నరసన్నపేట: మండలం నడగాంకు చెందిన కొల్ల సూరి(72) ఆత్మహత్యకు పాల్పడినట్లు నరసన్నపేట ఎస్ఐ అశోక్‌బాబు తెలిపారు. ఆయన శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించగా.. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు. కుటుంబంలో ఉన్న మనస్పర్థల కారణంగా ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు.



కొల్ల సూరి

త్రుటిలో తప్పిన ప్రమాదం

టెక్కలి రూరల్: మండలంలోని అక్కవరం గ్రామ సమీపంలో జాతీయ రహదారి పక్కగా నిలిపి ఉన్న ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొట్టింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం... టెక్కలికి చెందిన ఏఎస్ఐ కేశవరావు తన ద్విచక్రవాహనాన్ని జాతీయ రహదారికి కొంచెం దూరంలో నిలిపి ఉంచాడు. అయితే శనివారం వేకువజామున పలాస నుంచి టెక్కలి వైపు వస్తున్న ఒక లారీ డ్రైవర్ నిద్ర మత్తులో అతివేగంగా వచ్చి ఆ బైక్‌ను ఢీకొట్టి కొద్ది దూరం ముందుకు వెళ్లి ఆపాడు. దీంతో బైక్ నుజ్జునుజ్జయిపోయింది. లారీ ఆపకపోయి ఉంటే లారీ బోల్తా పడి ఉండేదని స్థానికులు తెలిపారు. అనంతరం పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని లారీని అదుపులో తీసుకుని వివరాలు సేకరించారు.

అర్ధరాత్రి పశువుల అక్రమ రవాణా

ఇచ్ఛాపురం రూరల్: గత కొంత కాలంగా ఆంధ్రా-ఒడిశా సరిహద్దు గ్రామం కేదారిపురం కేంద్రంగా స్థానికుల సహకారంతో పశువుల అక్రమ రవాణా సాగుతోంది. పోలీసులు పలుమార్లు దాడులు చేసినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. స్థానికులు సమాచారం మేరకు రూరల్ ఎస్ఐ ఎస్.లక్ష్మణ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం అర్ధరాత్రి దాడి చేసి 22 పశువులను అక్రమంగా తరలిస్తున్న వ్యానును, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. వ్యానులో ఎనిమిది ఎద్దులు, పదకొండు ఆవులు, మూడు దూడలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. గుంటూరు జిల్లా చిలకలూరిపేట అలమండ సంతకు తీసుకువెళ్లి అక్కడి నుంచి కబేళాకు తరలిస్తున్నట్లు డ్రైవర్ పోతూరు ఆంజనేయులు పోలీసులకు తెలిపాడు. అక్రమ రవాణాకు కారకుడైన కేదారిపురం గ్రామాని కి చెందిన సంతోష్ రౌళోను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ లక్ష్మణ తెలిపారు.



పశువులను కబేళాకు తీసుకువెళ్తున్న వ్యాను

'టీచర్ల సర్దుబాటు నిర్ణయం సరికాదు'

ఇచ్ఛాపురం రూరల్: టీచర్లను సర్దుబాటు చేస్తూ ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం సరికాదని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.శివరామ్ ప్రసాద్, కీలు సోమేశ్వరరావు అన్నారు. ఈ మేరకు శనివారం జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్యకు వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఉపాధ్యాయ సంఘాలతో సమన్వయ సమావేశం నిర్వహించి, క్షేత్ర స్థాయిలో అభిప్రాయాలు తీసుకొని నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు. 117 జీఓ రద్దు చేయాలని, పదోన్నతుల తర్వాతనే ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలని, ప్రతి పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 10 కన్నా ఎక్కువ ఉంటే ఇద్దరు టీచర్లను నియమించాలని, సర్దుబాటు చేయడానికి ఉపాధ్యాయులు లేని పక్షంలో అకడమిక్ విద్యా వలంటీర్లను నియమించాలని కోరారు. అదే విధంగా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా హిందీ టీచర్లను కూడా నియమించాలని కోరారు. వినతి పత్రం అందించినవారిలో జిల్లా గౌరవ అధ్యక్షులు పి.కాశీవిశ్వనాథ్, రాజాపు శ్రీనివాసరావులు ఉన్నారు.



డీఈఓ తిరుమల చైతన్యకు వినతి పత్రం అందిస్తున్న ఆపస్ జిల్లా కార్యవర్గ సభ్యులు

క్లుప్తంగా

వినతులు స్వీకరించిన మంత్రి కొండపల్లి



వినతులు స్వీకరిస్తున్న మంత్రి కొండపల్లి

విజయనగరం అర్బన్: రాష్ట్ర చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, సెర్ప్, ఎన్‌ఆర్‌ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శనివారం స్థానిక జిల్లా పరిషత్ అతిథి గృహంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు మంత్రిని కలసి తమ సమస్యలను విన్నవించారు.

కలెక్టరేట్‌లో రేపు..

మంత్రి కొండపల్లి ఈ నెల 12న జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నారు. ఆ రోజు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు మంత్రి ప్రజల నుంచి వినతులు స్వీకరించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తారని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు.

రాత్రి 11 గంటల తర్వాత దుకాణాల బంద్..

- అనుమానాస్పదంగా సంచరించినా చర్యలు తప్పవు
- ఎస్పీ వకుల్ జిందల్



వకుల్ జిందల్, ఎస్పీ

విజయనగరం క్రైమ్: జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో రాత్రి 11 గంటల తర్వాత ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో సంచరించినా, వ్యాపారాలు సాగించినా వారిపై కేసులు నమోదు చేయాలని పోలీసు అధికారులను ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. శనివారం తన కార్యాలయం నుంచి పోలీస్ అధికారులతో మాట్లాడారు. శాంతి,భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో భాగంగా కొన్ని కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాత్రి సమయాల్లో యువత పట్టణాల్లో సహేతుకరమైన కారణాలు లేకుండా విచ్చలవిడిగా తిరుగుతున్నారని తెలిపారు. రాత్రి గస్తీ, పెట్రోలింగ్ నిర్వహించే పోలీస్ సిబ్బంది, అధికారులు ఇటువంటి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రాత్రి 11 గంటల తర్వాత పట్టణాల్లో ఎటువంటి వ్యాపారాలు నిర్వహించకుండా చర్యలు చేపట్టాలన్నారు. అనుమానాస్పదంగా సంచరించినా కేసులు నమోదు చేయాలని సూచించారు. అంతేకాకుండా మద్యం మత్తులో వాహనాలు నడిపి, ప్రమాదాలకు కారణమవుతున్న వాహనదారులపైనా ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని ఆదేశించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బొండపల్లి: ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మండలంలోని అంబటివలస గ్రామానికి చెందిన కందుకూరి రామారావు (45) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారని ఎస్‌ఐ కె.లక్ష్మణరావు తెలిపారు. రామారావు ఈనెల 8వతేదీన గ్రామానికి ఆనుకుని ఉన్న జాతీయ రహదారి-26పై నడిచి వెళుతుండగా జామి మండలానికి చెందిన ద్విచక్ర వాహనచోదకుడు గజపతినగరం వైపు వెళుతూ వెనుక నుంచి బలంగా ఢీకొట్టారు. ప్రమాదంలో రామారావు తలకు తీవ్ర గాయాలు కావడంతో విశాఖపట్నంలోని కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందారు. మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ చెప్పారు.

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



విశ్రాంతి భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు: గర్భిణుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని స్త్రీశిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. పట్టణంలో ఏరియా ఆస్పత్రి వద్ద రోగుల పరామర్శకు వచ్చే కుటుంబ సభ్యులు వేచి ఉండేందుకు నిర్మించిన విశ్రాంతి భవనాన్ని శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గర్భిణుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని వైద్యాధికారులు, సిబ్బందికి సూచించారు. ఏడవ నెల నుంచి గర్భిణులకు నిరంతరం వైద్య పరీక్షలు చేయాలని, రక్తహీనత, పౌష్టికాహార లోపాలను గుర్తిస్తే వాటిని అధిగమించే చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎనిమిదో నెల రాగానే వైటీసీలో ఏర్పాటు చేసిన గిరిశిఖర గర్భిణుల వసతిగృహంలో చేర్చాలని సూచించారు. మరిన్ని ఫీడర్ అంబులెన్స్ సర్వీసులు వినియోగంలోకి తీసుకువస్తామని అన్నారు. త్వరలోనే వంద పడకల ఆస్పత్రి నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు. ఏఎన్‌ఎమ్, ల్యాబ్ టెక్నీషియన్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యాధికారులు, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మృత్యువుతో పోరాటం..



కాళ్లు, చేతులు కోల్పోయి దీనావస్థలో ఉన్న ఫణిధర్



భార్య అనిత,ఇద్దరు ఆడపిల్లలతో ఫణిధర్ (ఫైల్)

- విద్యుత్ షాక్‌తో చేతులు, కాళ్లు కోల్పోయిన పంచాయతీ కార్యదర్శి
- ఆర్థిక సమస్యలతో దిక్కుతోచని స్థితిలో కుటుంబం
- దాతల కోసం ఎదురుచూపులు

వీరఘట్టం: కొద్దిరోజుల కిందటి వరకు భార్య, ఇద్దరు ఆడపిల్లలతో అతను ఎంతో ఆనందంగా జీవనం సాగించాడు. వీరి దాంపత్య జీవితంపై కన్నుకుట్టిన దేవుడు విద్యుత్ షాక్ రూపంలో ఆ ఇంటి పెద్దదిక్కును చావుదెబ్బ తీశాడు. దీంతో ఆ ఇంటి పెద్ద దిక్కుగా ఉన్న భర్త కోరాడ ఫణిధర్ ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడుతున్నాడు. విద్యుత్ షాక్‌తో ప్రాణాపాయం తప్పినప్పటికీ రెండు కాళ్లు, చేతులను వైద్యులు తొలగించడంతో విశాఖపట్నం కేజీహెచ్‌లో జీవచ్ఛవంలో ఫణిదర్ కొట్టుమిట్టాడుతున్నాడు. పాలకొండ మండలం గొట్ట మంగళాపురం పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న కోరాడ ఫణిధర్ గత నెల 25న పాలకొండలో తన ఇంటి వద్ద ప్రమాదవశాత్తూ 11 కేవీ విద్యుత్ తీగలకు తగిలి గాయపడ్డాడు. ప్రస్తుతం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఫణిధర్ కుటంబ పరిస్థితిని చూసి సహచర సిబ్బంది కొంతమేర ఆర్థిక సాయం అందజేశారు. గత నెల 30న ఇతనికి రెండు చేతులను వైద్యులు తొలగించారు. ఈ నెల 5న రెండు కాళ్లను కూడా తొలగించారు.

సాయం కోసం ఎదురుచూపులు..

ఫణిధర్‌కు వీరఘట్టానికి చెందిన పట్నాన అనితతో 16 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఇద్దరు ఆడ పిల్లలు కాగా.. పెద్దమ్మాయి 8వ తరగతి, చిన్నమ్మాయి ఆరో తరగతి చదువుతున్నారు. ఇప్పుడు కుటుంబ భారం అంతా భార్యపై పడింది. కాళ్లు, చేతులు లేక మృత్యువుతో పోరాడుతున్న భర్త ఓ వైపు, చదువుకుంటున్న ఇద్దరు ఆడపిల్లలు మరో వైపు.. దీంతో కుటుంబాన్ని ఎలా నెట్టుకురావాలో తెలియక అనిత కన్నీరుమున్నీరవుతోంది. ప్రభుత్వం నుంచి, దాతల నుంచి సహాయం కోసం ఆమె ఎదురుచూస్తున్నారు. ఎవరైనా ఈ కుటుంబానికి సాయం చేయాలంటే 62816 91501 నంబర్‌ను సంప్రదించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

ప్రజారోగ్యమే ధ్యేయం..



స్థానికుల ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకుంటున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జగన్ మోహనరావు

- మాతా, శిశు ఆరోగ్యంపై పర్యవేక్షణ తప్పనిసరి
- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ టి. జగన్‌మోహనరావు

పార్వతీపురం టౌన్: ప్రజారోగ్యమే ధ్యేయంగా ఆరోగ్య కార్యక్రమాలను పక్కాగా నిర్వహించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ టి. జగన్ మోహనరావు సూచించారు. మండలంలో వెంకటరాయుడుపేట గ్రామాన్ని శనివారం ఆయన సందర్శించారు. గ్రామంలో జ్వరాలు, ఇతర సీజనల్ వ్యాధుల ప్రభావం ఏమైనా ఉందా.. శానిటేషన్ తీరు, స్ప్రేయింగ్ నిర్వహణ, తదితర వివరాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అలాగే వైద్య సిబ్బంది నిర్వహించిన సార్వత్రిక టీకా కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఆర్‌సీహెచ్, ఎంసీపీ రికార్డుల్లో గర్భిణులు, పిల్లల టీకాల గడువు తేదీలు, టీకాలు వేస్తున్న తేదీలతో సరి చూశారు. చిన్నారులు, గర్భిణుల్లో రక్తహీనత రాకుండా చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడీ సిబ్బందిని ఆదేశించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయగౌడ్, ఏఎన్‌ఎం రామలక్ష్మి, ఆశ కార్యకర్త, సీహెచ్‌డబ్ల్యూ, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా టాస్క్‌ఫోర్స్ దాడులు

విజయనగరం క్రైమ్: ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ టీమ్ జిల్లా వ్యాప్తంగా శనివారం దాడులు చేపట్టింది. భోగాపురం మండలం బసవపాలెం గ్రామశివారులోని జీడితోటలో పేకాటాడుతున్న 11 మందిని అదుపులోకి తీసుకుని 1,26,500 నగదు, 11 ఫోన్లు, మూడు ద్విచక్ర వాహనాలు సీజ్ చేశారు. గంట్యాడ మండలం రామవరం గ్రామం వద్ద ఎస్సై బి.సురేంద్ర నాయుడు వాహన తనిఖీలు చేపట్టారు. తమిళనాడుకు చెందిన ఒక వ్యాపారి కంటైనర్‌లో 40 పశువులను తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసి కంటైనర్‌ను సీజ్ చేశారు. నెల్లిమర్ల ఎస్సై రామగణేష్ ఆధ్వర్యంలో ఇసుక అక్రమంగా తరలిస్తున్న ఒకరిని అదుపులోకి తీసుకుని ఒక లారీని, పదిటన్నుల ఇసుకను సీజ్ చేశారు. టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి కొత్తపేట మంటపం వద్ద టూటౌన్ ఎస్సై దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు చేపట్టి 2500 కిలోల పీడీఎస్ బియ్యం, బొలేరో వాహనాన్ని సీజ్ చేశారు. అలాగే జిల్లా వ్యాప్తంగా వాహన తనిఖీలు, డ్రంకన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ తనిఖీలు చేపట్టి నిబంధనలు అతిక్రమించిన 339 మందికి రూ.95, 455 ఈ చలానాలను విధించారు.

ఎగువ దాగరవలసలో డెంగీ కేసు నమోదు

సాలూరు రూరల్: మండలంలోని కొత్తవలస పంచాయతీ ఎగువ దాగరవలస గ్రామంలో డెంగీ కేసు నమోదైనట్లు మామిడిపల్లి పీహెచ్‌సీ డాక్టర్ శివకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ, ఆశ వర్కర్లు ఈ నెల ఐదో తేదీన ఇంటింట ఫీవర్ సర్వే చేపట్టగా.. గ్రామానికి చెందిన చింతల చంద్రమ్మ (23) కడుపునొప్పితో బాధపడుతున్నట్లు గుర్తించి, విజయనగరం ఘోషా ఆస్పత్రిలో చేర్పించారన్నారు. అయితే ఈ నెల 9న ఆమెకు మరోసారి పరీక్షలు నిర్వహించగా డెంగీ సోకినట్లు గుర్తించారని తెలిపారు.

ఎస్సీ వర్గీకరణపై నిరసన



మానవహారంగా ఏర్పడిన దళితుల సంఘాల నాయకులు

- పాలకొండలో భారీ ర్యాలీ

పాలకొండ రూరల్: ఎస్సీ వర్గీకరణ తీర్పును అత్యున్నత న్యాయస్థానం పునః సమీక్షించాలని దళితులు కోరారు. ఈ అంశాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ పాలకొండలో శనివారం నిరసన తెలిపారు. స్థానిక వైఎస్సార్ కార్గిల్ కూడలి నుంచి యాలాం కూడలి వద్ద గల అంబేడ్కర్ విగ్రహం వరకు పెద్దెత్తున ర్యాలీ చేపట్టారు. ఈక్రమంలో ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. దీనికి తోడు రాష్ట్రంలో జిల్లా యూనిట్‌గా ఎస్సీ వర్గీకరణ చేపడతామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించడంపై తీవ్రంగా మండిపడ్డారు. ఈ అంశమై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు ఎద్దు లిల్లీ పుష్పనాథం, నూతలపాటి భరత్ భూషణరాజు, తదితరులు మాట్లాడుతూ.. వర్గీకరణ వద్దు. కలసి ఉండడమే ముద్దని నినదించారు. మాజీ ఎంపీ హర్షకుమార్ నాయకత్వంలో ఈ విధానాన్ని వ్యతిరేకిస్తూ ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో దళిత సంఘాల జిల్లా, ముఖ్య నాయకుల బత్తిన మోహనరావు, ఉపేంద్రకుమార్, కొంచాడ జాన్, రామారావు, నాగరాజు, ప్రసాద్, రవికుమార్, గణేషబాబు, జీవరత్నంతో పాటు దళితులు పాల్గొన్నారు.

బంగారం చోరీ కేసులో నిందితుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ (వెనుక ముసుగులో నిందితులు)

విజయనగరం క్రైమ్: ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద బ్యాగ్‌లో ఉన్న రూ. 50 వేల నగదు, అరతులం బంగారు శతమానాలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు ఈ నెల 8న ప్రదీప్‌నగర్‌కి చెందిన బెహర మంగ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు ప్రారంభించిన వన్‌టౌన్ పోలీసులు ఎర్రసాని ఎర్రమ్మ, యర్రుల సాయికుమారి, ఉయ్యాల దుర్గమ్మ, ఒక బాలికను శనివారం అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 50 వేల నగదు, అరతులం బంగారాన్ని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ ఎస్. శ్రీనివాస్ శనివారం వివరాలు వెల్లడించారు. నిందితులు తాడేపల్లిగూడెంకు చెందిన వారని, రద్దీ ప్రదేశాల్లో ప్రయాణికుల్లా నటించి ఆర్టీసీ బస్సుల వద్ద, ఆటోస్టాండ్‌ల వద్ద ప్రయాణికుల నగదు, బంగారు నగలను తస్కరిస్తుంటారని చెప్పారు. ప్రజలు తమ విలువైన వస్తువులను తీసుకెళ్లేటపప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. నేరం జరిగిన 48 గంటల్లోపు కేసును ఛేదించిన ఎస్సై తారకేశ్వరరావు, సిబ్బంది శ్రీదేవి, శ్రీను, గౌరీలను డీఎస్పీ అభినందించారన్నారు.

నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యమివ్వండి

విజయనగరం అర్బన్: నామినేటెడ్ పోస్టుల భర్తీలో వెలమ సామాజిక వర్గానికి తగిన ప్రాధాన్యమివ్వాలని ఆంధ్రప్రదేశ్ వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగు మన్మధరావు కోరారు. ఇదే విషయమై ఆయన శనివారం మాట్లాడుతూ బీసీ-డిలో ఉన్న వెలమలను బీసీ-ఏ కేటగిరీలోకి మార్చాలన్నారు. స్వతహాగా తెలివైన ఓసీలను బీసీ-డిలో చేర్చడం వల్ల వ్యవసాయమే జీవనాధారంగా బతికే వెలమలు వారితో పోటీ పడలేకపోతున్నారన్నారు. అన్ని కులాలకు న్యాయం చేసినట్లే వెలమలకు కూడా న్యాయం చేయాలని కోరారు.

రైలు కింద పడి యువకుడి మృతి



ఈరోతు కార్తీక్ (ఫైల్)

భామిని: మండలంలోని దిమ్మిడిజోలకు చెందిన యువకుడు ఈరోతు కార్తీక్ (28) రైలు కింద పడి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే... ఐటీఐ పూర్తి చేసిన కార్తీక్ మూడేళ్లుగా హైదరాబాద్‌లో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. గురువారం స్వగ్రామానికి రావడానికి బయలుదేరిన కార్తీక్ శుక్రవారం రాత్రి ఆముదాలవలస రైల్వే ట్రాక్‌పై శవమై కనిపించాడు. దీంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఇదిలా ఉంటే రైల్వే అధికారుల సమాచారం మేరకు గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని తెలిసింది.

గుర్తు తెలియని వాహనం ఢీ కొని యువకుడు..

పార్వతీపురం టౌన్: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో యువకుడు మృతి చెందాడు. కేంద్రాస్పత్రి ఔట్‌పోస్టు పోలీసులు, మృతుడు బంధువులు ఇచ్చిన సమాచారం మేరకు.. విశాఖపట్నం జిల్లా కొత్త గాజువాక గణేష్‌నగర్‌కు చెందిన షేక్ రోషన్ (26) కొంతకాలంగా ఇంటి సీలింగ్ పనులు చేసుకుంటూ పట్టణంలోని బంగారమ్మ కాలనీలో నివాసముంటున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి తన పనులు ముగించుకుని వెంకంపేట నుంచి వస్తుండగా బెలగాం శివారులో ఆంజనేయస్వామి ఆలయం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో రోషన్ అక్కడక్కడే మృతి చెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు ఔట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జ్వరంతో మహిళ మృతి



గువ్వాడ సుమతి (ఫైల్)

భామిని: మండలంలోని గురండి గ్రామంలో అంగన్‌వాడీ సహాయకురాలిగా పనిచేస్తున్న గువ్వాడ సుమతి (37) జ్వరంతో బాధపడుతూ శనివారం మృతి చెందింది. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. సుమతి మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతూ వైద్యసేవల కోసం కన్నవారి ఊరైన కొరమకు వచ్చింది. ఇక్కడ ఉంటూ కొత్తూరులోని ఓ ప్రైవేట్ వైద్యుడి వద్ద మందులు వాడుతోంది. శనివారం ఉదయం పరిస్థితి విషయమించడంతో కుటుంబ సభ్యులు ఆమెను ఆటోలో వైద్యుడి వద్దకు తీసుకెళ్లగా... ఆయన శ్రీకాకుళం తీసుకెళ్లమని సూచించాడు. దీంతో అదే ఆటోలో శ్రీకాకుళం తీసుకెళ్తుండగా.. మార్గమధ్యలో మృతి చెందింది. మృతదేహాన్ని గురండి తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలున్నారు. కొరమ మాజీ సర్పంచ్ అగతముడి గోవిందరావు, గురండి సర్పంచ్ జామి బైరాగి, తదితరులు ఆమె మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

ముగిసిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు



రాష్ట్ర స్థాయి పోటీల విజేతలతో నగర మేయర్ విజయలక్ష్మి, తదితరులు

- విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన నగర మేయర్

విజయనగరం: జిల్లా కేంద్రంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జూనియర్స్ తైక్వాండో పోటీలు శనివారంతో ముగిశాయి. రెండు రోజులుగా జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని రాజీవ్ క్రీడామైదానం ప్రాంగణంలో నిర్వహించిన పోటీలకు రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 120 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగిన పోటీల్లో విజేతలకు విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, అంతర్జాతీయ క్రీడాకారుడు రషీద్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. నేటి తరం యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. పలు రంగాల్లో ప్రతిభ, పాటవాలు కనబరిచినప్పుడే ఉన్నత అవకాశాలు అందిపుచ్చుకోగలరని చెప్పారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, రానున్న రోజుల్లో మరింత కఠిన సాధనతో అద్భుత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలు విజయనగరంలో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి డీవీ చారిప్రసాద్ మాట్లాడుతూ.. ప్రథమ స్థానంలో నిలిచిన క్రీడాకారులు ఈ నెల 16, 17, 18 తేదీల్లో మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సుంకరి సతీష్, జిల్లా తైకాండో అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో పట్టణ క్రీడాకారుల ప్రతిభ



పతకాలతో విజేతలు

విజయనగరం అర్బన్: అనంతపురంలో ఈ నెల 3న జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో పట్టణానికి చెందిన గురజాడ పాఠశాల విద్యార్థులు వై.కారుణ్య సిల్వర్, తేజస్వి బ్రాంజ్ మెడల్ సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ పూడి శేఖర్ తెలిపారు. అదేవిధంగా ఇటీవల జిల్లా స్థాయిలో జరిగిన త్వైకాండో పోటీలలో వై.కారుణ్య, తేజస్విని, విశాల్, జయవర్ధన్, తదితరులు పతకాలు సాధించారని చెప్పారు. ఈమేరకు విద్యార్థులను శనివారం ప్రత్యేకంగా అభినందించారు.

రాష్ట్రస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీలకు పలువురి ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోషియేషన్ ప్రతినిధులు

నెలిమర్ల రూరల్: మండలంలోని కొండవెలగాడలో రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ ఎంపిక పోటీలను శనివారం నిర్వహించారు. పలువురు క్రీడాకారులు ఎంపిక పోటీల్లో హోరాహోరీగా తలపడ్డారు. మహిళల విభాగంలో 40 కిలోల కేటగిరీలో ఒకరు, 45 కిలోల కేటగిరీలో ముగ్గురు, 49 కిలోల కేటగిరీలో ఇద్దరు, 55 కిలోల కేటగిరీలో ఇద్దరు, 59 కిలోల కేటగిరీలో ముగ్గురు, 64 కిలోల కేటగిరీలో ఇద్దరు, 71 కిలోల కేటగిరీలో ఒకరు, 81 కిలోల కేటగిరీలో ఒకరు, 87 కిలోల కేటగిరీలో ఒకరు, 89 కిలోల కేటగిరీలో ఇద్దరు చొప్పున ఎంపికైనట్లు కోచ్ చల్లా రాము తెలిపారు. పురుషుల విభాగంలో 49 కిలోల కేటగిరీలో ఇద్దరు, 55 కిలోల కేటగిరీలో ఇద్దరు, 61 కిలోల కేటగిరీలో ముగ్గురు, 67 కిలోల కేటగిరీలో ఇద్దరు, 73 కిలోల కేటగిరీలో ముగ్గురు, 81 కిలోల కేటగిరీలో ఇద్దరు, 89 కిలోల కేటగిరీలో ఇద్దరు చొప్పున ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 30 నుంచి అనకాపల్లిలో జరగనున్న రాష్ట్రస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

ప్రమాద సంఘటనపై కేసు నమోదు

రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి రోడ్డులో ఈ నెల 4వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదానికి సంబంధించి, కేసు నమోదు చేశామని సీఐ డి.మోహనరావు శనివారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాలిలా.. లావేరు మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన చందక లక్ష్మంనాయుడు బొబ్బిలి నుంచి రాజాం మీదుగా వెంకటాపురానికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. రాజాం పట్టణ పరిధిలోని వస్త్రపురికాలనీ సమీపానికి వచ్చేసరికి ఎదురుగా మరో ద్విచక్ర వాహనంపై వచ్చిన వ్యక్తి ఢీకొనడంతో లక్ష్మంనాయుడు కాలికి బలమైన గాయాలయ్యాయి. అప్రమత్తమైన స్థానికులు చికిత్స నిమిత్తం రాజాం సామాజిక ఆస్పత్రికి క్షతగాత్రుడిని తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు వైద్యులు రిఫర్ చేశారన్నారు. ఈ మేరకు బాధితుని భార్య మహాలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అలాగే మండలంలోని ఒమ్మి గ్రామంలో జరిగిన వ్యవసాయ మోటారు అపహరణపై శనివారం కేసు నమోదు చేశామని సీఐ డి.మోహనరావు తెలిపారు. గ్రామానికి చెందిన వంగా మహేష్ పొలంలోని మోటార్‌ను జూలై 30వ తేదీన గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారన్నారు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మోదమ్మను దర్శించుకున్న న్యాయమూర్తి దుర్గయ్య

సాక్షి, పాడేరు: ఉత్తరాంధ్ర భక్తుల ఆరాధ్య దైవం పాడేరులోని మోదకొండమ్మతల్లిని విజయనగరం అదనపు జిల్లా న్యాయమూర్తి జి.దుర్గయ్య కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. శనివారం ఆలయానికి విచ్చేసిన న్యాయమూర్తిని, కుటుంబ సభ్యులను ఆలయ అర్చకుడు సుబ్రహ్మణ్యం, ఆలయ కమిటీ ప్రతినిధులు స్వాగతం పలికారు. అనంతరం మోదమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి దంపతులను ఆలయ కమిటీ సభ్యులు దుశ్శాలువతో సత్కరించి, మోదమ్మ ఫొటో, ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబునాయుడు, న్యాయవాది తమర్బ ప్రసాద్ నాయుడు, స్థానిక కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



మోదకొండమ్మతల్లిని దర్శించుకున్న విజయనగరం జిల్లా అదనపు జడ్జి దుర్గయ్య కుటుంబ సభ్యులు

గజరాజుల బీభత్సం

గరుగుబిల్లి: మండలంలోని నాగూరు గ్రామంలో గజరాజులు శనివారం బీభత్సం సృష్టించాయి. గ్రామంలోని బి.సత్యనారాయణమూర్తికి చెందిన రైస్‌మిల్లు షట్టర్లను విరగ్గొట్టి లోపలికి ప్రవేశించి బియ్యం, ధాన్యం బస్తాలు చిందరవందర చేశాయి. అనంతరం ప్రధాన రహదారి వెంబడి సంచరించాయి. వీటిని చూసేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కొద్ది రోజుల నుంచి తోటపల్లి, నందివానివలస, గిజబ, సంతోషపురం తదితర గ్రామాల్లో గజరాజులు సంచరిస్తున్నాయి. వీటి సంచారంతో ఖరీఫ్ వ్యవసాయ పనులకు వెళ్లేందుకు రైతులు భయపడుతున్నారు. వీటి నుంచి రక్షణ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.